క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ రాయయ్య తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. కోడేరు మండలం నాగులపల్లికి చెందిన భాస్కర్, ఔరాసిపల్లికి చెందిన కాశీంలు ఈనెల 22న మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారు. పోలీసులు మంగళవారం వారిని కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష విధించి, రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహిత అదృశ్యం కేసు నమోదైనట్లు నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. చందుబట్ల గ్రామానికి చెందిన ఉషారాణి ఈనెల 16న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

షీటీం అదుపులో నలుగురు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండలంలోని వట్టెం గ్రామంలో కళాశాల అమ్మాయిలను, పాఠశాలల విద్యార్థులను యు టీజింగ్ చేస్తున్న పోకిరీలను షీటీం సభ్యులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వట్టెం బస్టాండు ప్రాంగణంలో, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఎదుట కొద్ది రోజులుగా కొందరు పోకిరీలు అమ్మాయిలను టీజింగ్ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న షీటీం బృందం నలుగురుని అదుపులోకి తీసుకున్నట్లు షీటీం అధికారి విజయలక్ష్మి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఉప్పునుంతల: అక్రమంగా తరలిస్తున్న రెండున్నర క్వింటాళ్ల బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హేమ్లా, ఏఎస్‌ఐ సుజ్ఞానం పట్టుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని వెల్టూరులో వ్యాపారి బిల్లకంటి వెంకటేశ్వర్లు ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని స్థానిక రేషన్ డీలర్ ప్రమీలకు అప్పగించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిల్ తెలిపారు.

వీబీకేను తొలగించాలని ఏపీఎంకు వినతి

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లిలో వీబీకేను తొలగించాలని గ్రామ సంఘం తీర్మానం చేసి ఆ పత్రాన్ని మంగళవారం ఏపీఎం శేఖర్‌కు అందజేశారు. గ్రామ సంఘంలో వీబీకే విధులు నిర్వహిస్తూ సంఘాల సభ్యులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సీసీ ఆమెకే వత్తాసు పలుకుతున్నారన్నారు. విచారణ చేసి ఆమెను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏపీ ఎమ్మెల్యే దిష్టి బొమ్మ దహనం



అమ్రాబాద్: అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపడం రాజ్యాంగాన్ని కించపరిచేలా ఉందని ఉందని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రఘురామకృష్ణరాజుపై ప్రభు త్వం కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు బాలకిష్టయ్య ఉన్నారు.

పీహెచ్‌సీ ఎదుట బీఆర్ఎస్ నిరసన

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజీపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యుల కొరత, మందుల కొరత ఉందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రదీప్‌లు మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య సదుపాయాలు లేవన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌గౌడు, స్వామి, వెంకటేష్, రవినాయక్ పాల్గొన్నారు.

ఆరోపణలు చేయడం సిగ్గుచేటు

కల్వకుర్తి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవగాహన రాహిత్యమని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభు త్వం నిర్వహించిన అమృత పథకం టెండర్లలో అవినీతి జరిగిందని ఆరోపించటం సిగ్గుచేటన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసం, శరీర దృఢత్వం ఏర్పడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని, ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల వినతి

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షులు సాదిక్ పాషా మాట్లాడుతూ ప్రజాభిప్రాయం మేరకు రేషన్ పాపుల్లో జనవరి నుంచి సన్నబియ్యం అందించాలని నిర్ణయించినందున ప్రభుత్వానికి కతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్లకు గౌరవవేతనం రూ.5వేలు అందించి, కమీషన్ పెంచే ప్రతిపాదనను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రేషన్ డీలర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే



నాటకం ప్రదర్శిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నాగర్ కర్నూల్: జిల్లా కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో ఎన్ఎస్ఎస్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ నాటక ప్రదర్శనలతో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రధాన రహదారి గుండా బస్టాండ్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళ్ల ముందు ఏదైనా సంఘటన జరిగినప్పుడు ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో స్పందించి సహాయం చేయాలన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థులు ఎన్ఎస్ఎస్ పేరుతో ప్రదర్శన కల్పించి ముగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తానా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ ఇతర అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మార్క్‌పోలోనియస్ మాట్లాడారు. వేడుకల్లో ఎన్ఎస్ఎస్ పీఓ సంతోష్ కుమార్, కళాశా అధ్యాపకులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: విద్యార్థులు సేవాభావం, జాతీయతను అలవర్చుకొని ప్రజలను చైతన్యం చేయాలని ప్రిన్సిపల్ ఎం.మదన్‌మోహన్ వివరించారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ఎన్‌యస్‌యస్ డే ను నిర్వహించారు. పరిసరాలలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



అచ్చంపేటలో మానవహారం నిర్వహించిన మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు

అచ్చంపేట: పట్టణంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది, కార్మికులు, మెప్మా, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో మానహారం నిర్వహించి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. రోడ్లను శుభ్రం చేశారు.

కొల్లాపూర్: మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు, కమిషనర్ శ్రీనివాసన్ కోరారు. కొల్లాపూర్‌లో స్వచ్ఛత హీ సేవ ర్యాలీ నిర్వహించారు.

తాడూరు: పరిశుభ్రత పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ బ్రహ్మాచారి అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా చర్లీటికాల గ్రామాన్ని సందర్శించారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు కిట్ల అందజేత



టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న అపోలో ప్రతినిధులు

మన్ననూర్: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ప్రధానమంత్రి టీబీముక్తు భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అపోలో టోటల్ హెల్త్ వారి ఆధ్వర్యంలో క్షయ వ్యాధి గ్రస్తులకు మంగళవారం పౌష్టికాహారం కిట్లను అందజేశారు. అచ్చంపేట డివిజన్‌లోని 8 మండలాలలోని పీహెచ్‌సీల పరిధిలోని 128 మంది క్షయ వ్యాధిగ్రస్తులను ఏడాది పాటు దత్తత తీసుకొని, వారికి నెలనెల పౌష్టికాహారం కిట్లు, మందులు అందజేస్తున్నట్లు టీబీ సూపర్‌వైజర్ ఆరీఫ్‌ఖాన్, తెలిపారు. అపోలో ఆస్పత్రి ప్రతినిధులు రాంబాబు, హరిత, పీహెచ్‌సీ సిబ్బంది మార్తమ్మ, కృష్ణ, శంకరమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



చెర్కూర్‌లో పోషకాహార వారోత్సవాలు నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

వెల్దండ: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని చెర్కూర్ సెక్టార్‌లో పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. చౌదర్‌పల్లి, పల్గుతండా, నారాయణపూర్, గన్యాబాగ్‌తండా, నారాయణపూర్‌తండా, సద్రలగడ్డతండా, రాఘయపల్లి తండా, చెర్కూర్ గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ గుర్తులను బియ్యం, పప్పులతో అలంకరించి బొమ్మలు వేశారు. అనంతరం అహార పదార్థాలను గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మమ్మ, చంద్రకళ, సరోజ, కమల, జ్యోతి, చిన్ని, జయకుమారి, ఆయాలు ఉన్నారు.

పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని పెద్దముద్దునూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిన్నపిల్లలు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మండల లేవల్ పోషణ మాసంలో భాగంగా బరువు తక్కువ ఉన్న పిల్లలు, బాలింతలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీడబ్ల్యూఓ రాజేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ, పీహెచ్‌సీ డాక్టర్, పోషణ అభియాన్ బీసీబీసీ సూపర్‌వైజర్, ఆశా, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రుణాల కోసం రైతుల ధర్నా



బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంకులో రుణమాఫీ అయినా రెన్యువల్ చేయకుండా కొత్త రుణాలు ఇవ్వడం లేదని మంగళవారం బ్యాంక్ ఎదుట రైతులు, బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షులు భీమేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. బ్యాంకు అధికారులు వచ్చే సోమవారం వరకు కొత్త లోన్లు మంజూరు చేయకపోతే పెద్ద ఎత్తున రైతులను సమీకరించి బ్యాంకు పనులు జరగకుండా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుండాల శివ, మెరుగు రాజు, ముచ్చు కృష్ణ, ఉపేందర్, మాగిని శివ, నరేష్, మేకల శివ, వంశీ, అంజి, మధు, లింగస్వామి, వెంకటస్వామి, రైతులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ విడుదల

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఈ నెల 28న నిర్వహించే బీసీ మహాధర్నాను విజయవంతం చే యాలని తెలంగాణ బీసీ మహాసభ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. మహాజన సభ ధర్నా పోస్టర్లను రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హైదరాబాద్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, వెంకటయ్య, శ్రీనివాస్ యాదవ్, రాజు, నరేష్, కొండల్ యాదవ్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు బంగారు పతకాలు

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఈ నెల 21న హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీలలో సాయి కీర్తన, అక్షయ, మంజూశ, శ్రీరాం, బాలు, భరత్‌లు వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందించారు. కార్యక్రమంలో పీడీ బాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తే మంచి గుర్తింపు



వెల్దండ: ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని సీఐ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై తాడూరు పోలీస్‌స్టేషన్ వెళ్తున్న కానిస్టేబుల్ వెంకటేష్‌ను సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కురుమూర్తి, ఏఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది సందీప్, శేఖర్, నాగరాజు, కృష్ణ, నవీణ్, కిషోర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బోధనలో మెళకువలు పాటించాలి

లింగాల: పాఠ్యాంశాల బోధనలో మెళకువలు పాటించాలని జీహెచ్ఎం బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు బోధకుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. శిక్షణలో లింగాల, బల్మూర్, ఉప్పునుంతల మండలాలకు చెందిన తెలుగు బోధకులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

కొల్లాపూర్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కొల్లాపూర్‌లో రైతుసంఘం నాయకులతో సమావేశమై మాట్లాడారు. కాంగ్రెస్ రూ.2లక్షల లోపు రుణాలున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని, ఆచరణలో అమలు చేయలేదన్నారు. సమావేశంలో బాలపీరు, వెంకట్, సలీం, సురేందర్ తదితరులున్నారు.

మంత్రి వర్గం ఏకపక్ష నిర్ణయం సరికాదు

మన్ననూర్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తెలుగు విశ్వ విద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును యథాతదంగా ఉంచాలని ముక్త కంఠంతో డిమాండ్ చేస్తున్నా రాష్ట్ర మంత్రి వర్గం తప్పుడు నిర్ణయంతో పేరు మార్చాలనడం సరైంది కాదని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు సంబు వెంకటరమణ, కొండూరు వెంకటేశ్వర్లు, జూలూరు సత్యనారాయణ, బిల్లకంటి రమేషలు తీవ్రంగా ఖండించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ




తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వేరోస్ విజ్‌డమ్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడారు. మహాత్మాగాంధీ 155వ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఉప్పునుంతల: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని లక్ష్మాపూర్, కాంసానిపల్లి, రాయిచెడ్ గ్రామాల్లో సీపీఎం గ్రామ శాఖ సమావేశాలు నిర్వహించారు. లక్ష్మాపూర్‌లో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా శ్రీరాములు, కాంసానిపల్లిలో మాచర్ల రామస్వామి, రాయిచెడ్‌లో గొడుగు వెంకటయ్యలు ఎన్నుకున్నారు.

ఉపాధి హామీ పనులపై విచారణ



కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామంలో ఉపాధి హామీ పనుల అవకతవకలపై డీఆర్‌డీఓ అంబుడ్స్‌మెన్ జంగయ్య మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. 2023లో చేసిన పనుల్లో అక్రమాలపై కూలీలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ పనులకు సంబంధించిన రికార్డులు సమర్పించలేదన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం



ఊర్కొండలో విద్యార్థులకు షూలు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ: మండలంలో ప్రభుత్వ బడులను బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. మండలానికి ఇప్పటికే ఇండోర్ స్టేడియం మంజూరైనట్లు తెలిపారు. ఊర్కొండను అన్ని మండలాలతో సమానంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పపహాడ్ గ్రామంలో మంగళవారం ఆయన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బూట్ల పంపిణీ ప్రారంభించారు. జకినాలపల్లిలో తుర్కం చెరువు నిర్మాణానికి రూ.5.10 కోట్లు మంజూరు చేయించానని, టెండర్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మండలంలో రోడ్ల నిర్మాణానికి ఆర్అండ్‌బీ ద్వారా రూ.60 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించామన్నారు. ఇప్పపాడ్, జకినాలపల్లి, బొమ్మరాజుపల్లి, జగబోయిన్‌పల్లి, బాల్యలోక తండా, రాంరెడ్డిపల్లి, ముచ్చర్లపల్లి, ఊర్కొండ, ఊర్కొండపేట, గుణగుంట పల్లి, రాచాలపల్లి, మాధారం, గుడిగానిపల్లి, రేవల్లి, తిమ్మన్నపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు. కార్యక్రమంలోతహసీల్దార్ రాంకోటి, ఎంఈఓ శంకర్ నాయక్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ఈఈ శ్రీధర్‌రావు

లింగాల: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తగా పని చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రావు అన్నారు. మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణా తరగతులను మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్యూరిఫైడ్ వాటర్ వాడకం వల్ల కలిగే చెడు ఫలితాలు ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో గ్రిడ్ ఈఈ సుధాకర్‌సింగ్, డీఈ హేమలత, ఏఈ బాల్‌రాంనాయక్, శిక్షకులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్‌జల్ పథకం మిత్రలకు స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్లో నాలుగు రోజుల శిక్షణా శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. నీటి వనరులు, లభ్యతతో పాటు, నీటి అవసరంపై శిక్షకులు విజయ్, నవీన్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సందీప్ మాట్లాడుతూ శిక్షకులు చెప్పే ప్రతి విషయాన్ని ఓపికతో విని గ్రామాల్లో నీటి వృథాను అరికట్టాలని సూచించారు.

అలుపెరగని ఉద్యమ కెరటం గద్దర్



మన్ననూర్: అలుపెరగని ఉద్యమ కెరటం, ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహావిష్కరణలో భాగంగా శ్రీశైలం –హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో మంగళవారం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గద్దర్ తన జీవిత కాలం మొత్తం అణగారిన ప్రజల అభ్యున్నతి కోసమే పరితపించాడన్నారు. నల్లమల ప్రాంతానికి గద్దర్‌కు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తెలంగాణలోని పాత 10 జిల్లాలలో మరో 10 విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూర్‌లో అక్టోబర్ 5న ఇండియన్ ఇంగ్లిష్ డే రోజున గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత పసునూరి రవిందర్, గద్దర్ గళం కొలూరు భరత్, కల్ముల నాసరయ్య, ధనుంజయ్, నల్లమల యాదయ్య, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఐపై చర్యలు తీసుకోవాలి

తాడూరు: తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సల్మాన్‌పై చర్యలు తీసుకోవాలని మంగళవారం కేవీపీఎస్ దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల కులం, ఆదాయం, వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం పంచనామా పత్రంలో సంతకాలు పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆర్ఐ చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కాశన్న డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ అలీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బాలవెంకటయ్య, కొత్ర బాలు, పరశురాం, భీమయ్య, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యాస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలి



తెలకపల్లి: న్యాస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సెర్ఫుద్దీన్ తెలిపారు. మంగళవారం మండలంలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలో ఆంగ్లపాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నెలలో నిర్వహించే న్యాస్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో 40 కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వివిధ అంశాలపై రీసోర్స్ పర్సన్ రా జశేఖర్‌రావు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, సెక్రటరీలు శివప్రసాద్, రామకృష్ణ, రీసోర్స్ పర్సన్ రఘురామరెడ్డి, ఐఈఆర్‌పీ రాజవర్ధన్‌రెడ్డి, కస్టర్ రీసోర్స్ పర్సన్ శ్యాంసుందర్, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడి తోటల రక్షణపై అవగాహన

పెద్దకొత్తపల్లి: చెన్నపురావుపల్లిలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పట్టుపరిశ్రమ మరియు ఉద్యానవన అధికారి జగన్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామంలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను ఎంపిక చేసిందన్నారు. ఉమ్మడి జిల్లాలో 57 వేల ఎకరాలలో మామిడి తోటలు సాగవుతున్నాయన్నారు. కేంద్రం ప్రభుత్వం మహబూబ్‌నగర్‌ను మెగా క్లస్టర్‌గా కేటాయించిందన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ డివిజన్ ఉద్యానవన అధికారి లక్ష్మణ్, ఏరియా మేనేజర్ రాకేష్, చంద్రశేఖర్, అజయ్, రైతులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

కొల్లాపూర్: కొల్లాపూర్ నుంచి నార్లాపూర్ మీదుగా లింగాల మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్టీసీ డీఎం ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు వెంకటస్వామిగౌడ్, రామన్‌గౌడ్, శంకర్ నాయక్, నాగరాజు, వెంకటస్వామి, హేమ్లా నాయక్ ఉన్నారు.